క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న నీరజ

జి.సిగడాం: మండల కేంద్రంలోని కేజీబీవీని జీసీడీవో సింహాద్రి నీరజ శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, బోధన ప్రణాళికల రికార్డులతోపాటు మెనూను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రత్యేక అధికారి డి.ఉషారత్నకుమారి ఉన్నారు.

146 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు శిబిరాన్ని ప్రారంభించారు. 146 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించిన యాజమాన్య సభ్యులను రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు సత్కరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. బ్లడ్ బ్యాంకుల్లో, ఆస్పత్రుల్లో రక్తం కొరత లేకుండా ఉండాలంటే యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ అన్నారు. యాజమాన్య సభ్యులు దుర్గాప్రసాద్‌రాజు, సనపల శ్రీనివాసరావు, దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌కాలనీలో సమస్యల పరిష్కారం



ఇంజనీర్లకు సమస్యలు వివరిస్తున్న యువనేత

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అరసవల్లి ప్రాంతంలో లక్ష్మినగర్‌కాలనీలో కొన్ని రోజులుగా తాగునీరు, డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు శుక్రవారం కాలనీలో పర్యటించి ఇంజినీర్లతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కరంచంద్, గొలివి వెంకటరమణ, అప్పుయాదవ్, గంగు శారద, గాయత్రి, పద్మ, తెలుగు రమేష్, లక్ష్మణ, మోహన్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: పర్యావరణ పరిరక్షణతో పాటు ఆహార భద్రత కోసం పండ్లతోటల పెంపకం చేపట్టాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. కోష్ట గ్రామ సమీపంలోని ఉద్యానవన పంటలైన మామిడి, జీడి, సపోటా, నిమ్మ, కమల, జామ వంటి పండ్ల మొక్కలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటివరకు 650 ఎకరాలకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ తరపున మొక్కలు పంపిణీ చేశామన్నారు. మొక్కలు కావాల్సిన వారు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు (9989284817), సమన్వయకర్తలు పి.రమణ (7799332544), రావాడ క్రిష్ణ (9063351310)లకు ఫోన్లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



జె.ఆర్.పురంలో కందకాలు పరిశీలిస్తున్న టెక్నికల్ బృందసభ్యులు

రణస్థలం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలిస్తున్నామని టెక్నికల్ సీఆర్‌డీ గౌరిశంకర్ తెలిపారు. మెంటాడ, సీహెచ్ రాజాం, జె.ఆర్.పురంలో జరిగిన పనులను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి టెక్నికల్ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. చెరువు పనులు, మొక్కల పెంపకం, భూగర్భ జలాలు పెంపునకు దోహదపడే కందకాలను తవ్వకాలను పరిశీలించారు. తనిఖీలో టెక్నికల్ జేఈ నాయక్, ఏపీడీ లోకేష్, ఏపీవో ఎం. శ్రీనివాసనాయుడు, జేఈలు, ఫీల్డ్ అసిస్టెంటులు ఉన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



జి.సిగడాం: వాండ్రంగిలో పూజలు చేస్తున్న భక్తులు

పూజలందుకుంటున్న ఏకదంతుడు



శ్రీకాకుళం కల్చరల్: అష్టోత్తర శత కలశాభిషేకం అనంతరం గణనాథుడు



లావేరు: ఆకట్టుకున్న గణపతి ముగ్గు

ఎచ్చెర్ల క్యాంపస్: గణపతి నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏకదంతుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందులో భాగంగా కుంచాల కుర్మయ్యపేటలోని సాయిభరత్‌నగర్‌లోని మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించగా..అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: కాలభైరవాలయంలో..

తాళ్లవలసలో ముగ్గులు పోటీలు

లావేరు: తాళ్లవలస గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ముగ్గులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో అన్నదాన కార్యక్రమం

వెంకటాపురం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. తొలుత గ్రామస్తులు వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతు ఎల్లంనాయుడు, వాళ్లే పెదదాలినాయుడు, పతివాడ గురునాయుడు, నెల్లి గురునాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జి.సిగడాం: చీడిపేట షిర్డీసాయి అపార్ట్‌మెంట్‌లో రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు



లావేరు: వెంకటాపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ప్రత్యేక పూజలు

జి.సిగడాం: మండల వ్యాప్తంగా వినాయక ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం హోమాలు, అభిషేకాల్లో భక్తులు అధికంగా పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: సాయిభరత్‌నగర్‌లోని మండపం వద్ద కుంకుమపూజల్లో మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: గైనేటివీధి సంపత్ వినాయకునికి గరిక పూజ

శ్రీకాకుళం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నగరంలోని సంపత్ వినాయక ఆలయంలో శుక్రవారం శ్రీసూక్త విధానంలో లలితా సహస్ర నామ అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు మోహనకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 108 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు కొండా రాంబాబు, మల్లారీదేవి, భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు
- శాలిహుండంలో గడపగడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అందుకు టీడీపీ మద్దతుదారులకు అందిన పథకాలే సాక్ష్యమని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం శాలిహుండం పంచాయతీలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తంగుళ్లపేట, శాలిహుండం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంతో పాటు లబ్ధిదారులకు పథకాల లబ్ధితో కూడిన కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంగుళ్లపేటలో టీడీపీ మద్దతుదారు గుండ ఉమాపతికి వ్యక్తిగతంగా రూ.రెండు లక్షలు, కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల మేర పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. పార్టీ చూడకుండా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫారసులకే ప్రాధాన్యం ఇచ్చేవారని, ఇప్పుడు పార్టీ, కులం, మతం, రాజకీయ సిఫారసులు అవసరం లేకుండానే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, పార్టీ కన్వీనర్ పీస గోపి, జల్లు గౌరీపతినాయుడు, చింతల గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని శ్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలు పొట్నూరు పద్మ అన్నారు. శ్రీకాకుళం నగరంలో శ్రీనిధి మహిళా సమాఖ్య కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి లక్ష్మి, కార్యదర్శిగా చిగురుకోట శ్రీదేవి, సహ కార్యదర్శిగా గంగు కళ్యాణి, కోశాధికారిగా మలిపెద్ది త్రివేణిలను ఎన్నుకున్నారు.

ప్రసాదాల వితరణ



పొన్నాడలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఇస్కాన్ జగన్నాథ మందిర నిర్వాహకులు లక్ష్మీపతి ఆధ్వర్యంలో శుక్రవారం పొన్నాడ గ్రామంలో ప్రసాదాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు అప్పలరాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబరు 14న చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు గీతా మందిరం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంతావారి వీధిలోని కృష్ణార్జున మందిరంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో 4 నుంచి 8 ఏళ్లలోపు చిన్నారులు, సీనియర్స్ విభాగంలో 8 నుంచి 10 ఏళ్లలోపు బాలబాలికలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు మిమిక్రీ శ్రీనివాస్ 9441072762 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ జగనన్న చేదోడు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ

గార/శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న చేదోడు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులను నేరుగా కలిసి దరఖాస్తుల పరిశీలన చేస్తున్నామని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ అన్నారు. శుక్రవారం శ్రీకూర్మం సచివాలయం పరిధిలో పలువురు లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో నిధులు విడుదల కానున్న నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు.

సంక్షిప్తంగా..

నాడు–నేడు పనులు పరిశీలన

జి.సిగడాం: నిద్దాం ఎంపీపీ పాఠశాలలో చేపడుతున్న మనబడి 'నాడు–నేడు'పనులను ఎంఈవోలు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు, ఏఈఈ జగదేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయులు శీరనాయుడు ఉన్నారు.

తగాదాలకు పాల్పడితే చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లో తగాదాలను సృష్టిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సామంతుల రామారావు హెచ్చరించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను సామరస్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనాల మేరకే ఊరేగింపు చేసుకోవాలన్నారు.

కషాయాలతో తెగుళ్ల నియంత్రణ

ఎచ్చెర్ల క్యాంపస్: కషాయాలతో తెగుళ్ల నియంత్రణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ప్రచారకురాలు రజని అన్నారు. కుశాలపురంలో బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వరిలో తెగుళ్ల నియంత్రణకు బ్రహ్మాస్త్రం కషాయాన్ని వినియోగించాలని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

జి.సిగడాం: రైతులు అధికదిగుబడులను ఇచ్చే ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయ నేచురల్ మాస్టర్ కె.రాజేశ్వరమ్మ అన్నారు. ముషినివలస గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారు చేసే విధానంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాంలో శుక్రవారం స్వచ్ఛత ఏసేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త బుట్టల వినియోగం, తడి, పొడిచెత్త విభజన, వ్యక్తిగత పారిశుద్ధ్యం వంటి అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గుండ భాగ్యశ్రీ , ఎంఆర్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెదరొంపివలసలో ఉచిత వైద్య శిబిరం

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాష్ అన్నారు. పెదరొంపివలస గ్రామంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 82 మందికి వైద్యులు తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. 12 మందిని మెరుగైన వైద్య సేవల కోసం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో పీఆర్వో సంతోష్, నాయకులు గొర్లె వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బగాది శాంతిశ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో 12 అంగన్‌వాడీ వర్కర్స్, 2 మినీ అంగన్‌వాడీలు, 37 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30 లోపు సంబంధిత శిశు అభివృద్ధి పథక అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నగర పరిధిలో..

శ్రీకాకుళం నగరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో జి.శోభారాణి తెలిపారు. 18వ వార్డు యాతవీధి అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉందని, బీసీ–ఈ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎస్సీ కుల విభజన చేయాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల కులాలను ఏ, బీ, సీ, డీ గా కుల విభజన చేయాలని కోరుతూ ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్‌కు మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ ప్రతినిధులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. జస్టిస్ (రిటైర్డ్) ఉషా మెహ్రా కమిషన్ 13 ఏళ్ల కిందట తన నివేదికను సమర్పించి, ఆర్టికల్ 341 (సుప్రా) సవరణకు సిఫార్సు చేసిందని వారు గుర్తు చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భారత ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిఫార్సు చేయాలని కోరారు. జేసీని కలిసిన వారిలో దాసరి తిరుమల రావు మాదిగ, లోపింటి తేజేశ్వరరావు మాదిగ. కానుక్కుర్తి. గోవింద్ మాదిగ, కంటిపాక హిమశేఖర్ మాదిగ, కమల మాదిగ ఉన్నారు.

ఇంటాక్ మేథా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు, బహుమతులతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: ఇంటాక్ మేథా పోటీల్లో వికాస్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా స్థాయి విజేతలుగా నిలిచారు. స్థానిక డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ సమావేశ మందిరంలో ఇంటాక్, న్యూఢిల్లీ, శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ నిర్వహించిన రాత, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను గురువారం అభినందించారు. ద్వితీయ స్థానంలో వికాస్ హైస్కూల్ రెండో టీం, బుద్ధ హైస్కూల్(కళింగపట్నం) సంయుక్తంగా నిలిచారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, సహ కన్వీనర్, క్విజ్ మాస్టర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు, సభ్యులు కె.రమణమూర్తి, ముఖ్య కార్యనిర్వాహక అధికారి బండాల ప్రసాదరావు, పూర్వ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, కో–కన్వీనర్ నటుకుల మోహన్, హారికా ప్రసాద్, చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, ఏటీఓ దుంపాక రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనలో సమూల మార్పులు

- డిప్యూటీ ఈవో తిరుమల చైతన్య



మాట్లాడుతున్న తిరుమల చైతన్య

రణస్థలం: పాఠ్యాంశాల బోధనలో సాంకేతిక జోడిస్తూ ప్రభుత్వం సమూల మార్పులు చేసిందని ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య తెలిపారు. లంకపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో డిప్యూటీ ఈవో ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించిన ఏడుగురు ఉపాధ్యాయులతో బోధన పద్ధతుల సరళిపై శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పాఠాలు చెప్పే తీరును నేరుగా పరీక్షించారు. ఒక్కో సబ్జెక్టుపై మూడేసి క్లాసులు పరిశీలించారు. పాఠాలు బోధించే సమర్థత, నైపుణ్యం ఏలా ఉందో గమనించారు. అనంతరం ఉపాధ్యాయినులతో సమావేశం నిర్వహించి పాఠాలు బోధించే పద్ధతులపై సలహాలు, సూచనలు చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.హైమవతి ఉన్నారు.

క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించారు. వీటిని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల నుంచి 1250 మంది క్రీడాకారులు హాజరరయ్యారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెట్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా అంశాల్లో అండర్–14, అండర్–17 బాల, బాలికలు కేటగిరీలో ఎంపికలు నిర్వహించారు. ఎనిమిది క్రీడాంశాల్లో జిల్లా పోటీల్లో పాల్గొనేందుకు 400 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకారం సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినీరెడ్డి, సర్పంచ్ పైడి భాస్కరరావు, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దరెడ్డి, నాయకులు కొత్తకోట సూర్యారావు, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న వేణుగోపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ: కృషి, పట్టుదలతో ఆడితే తప్పక విజయం సొంతమవుతుందని సాయిబాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కె.వేణుగోపాల్ అన్నారు. ఇటీవల విశాఖపట్నం జిల్లా పరవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గెలిపొందారు. విజేతలుగా గెలిచిన క్రీడాకారులను శుక్రవారం అఫీషియల్ కాలనీలో అబ్దుల్‌కలాం పార్కులో అభినందించారు. కార్యక్రమంలో పి.రవికుమార్, ఎస్.చంద్రరరావు, గాయత్రీ, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు.